సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం : 1 : జనవరి : 2025



కొత్త ఆశలతో..

సీతారామ ప్రాజెక్ట్ పూర్తవుతుందని రైతుల్లో నమ్మకం

- సింగరేణిలో కొత్త గనుల ప్రారంభానికి ఎదురుచూపులు
- విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధిపై ధీమా
- రవాణా రంగానికి కొత్తగా 'రెక్కలు'
- ఎకో టూరిజానికి అపార అవకాశాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: అడవులు, పరిశ్రమలకు జిల్లా నెలవు అన్నట్టుగా ఇన్నాళ్లూ సాగింది. గోదావరి, కిన్నెరసాని వంటి నదులు.. బయ్యారం, సింగభూపాలెం తదితర గొలుసుకట్టు చెరువులు, పెద్దవాగు, తాలిపేరు లాంటి చిన్నతరహా ప్రాజెక్టులు ఉన్నప్పటికీ జిల్లాలో సాగునీటి ఏర్పాట్లు పెద్దగా లేవనే చెప్పాలి. గోదావరి జలాలను జిల్లా పొలాలకు మళ్లించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్టు కారణంగా గరిష్టంగా భూమిని, అడవిని నష్టపోయింది ఈ జిల్లానే అయినా.. ఇప్పటివరకు ఒక్క ఎకరాకూ నీరందలేదు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి కచ్చితంగా సాగునీరు అందిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి గత ఆగస్టు 15న హామీ ఇచ్చారు. ఈ మేరకు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు ప్రారంభమయ్యాయి. వచ్చే వేసవిలో పనులు పూర్తయితే తొలిసారిగా జిల్లాలోని పొలాలకు గోదావరి జలాలు అందుతాయి. అయితే ఇది కొద్ది భాగానికే పరిమితం. యాతాలకుంట టన్నెల్ పూర్తయితేనే అశ్వారావుపేట నియోజకవర్గానికి లబ్ధి చేకూరుతుంది. ప్రస్తుత ప్లాన్ ప్రకారం పినపాక, కొత్తగూడెం నియోజకవర్గాలకు ఈ పథకం ద్వారా ఒనగూరే ప్రయోజనం అంతంతగానే ఉంది. ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గాలకు అసలు చోటే లేదు. దీనిపై ఈ ఏడాది అయినా దృష్టి సారించాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

విద్య, వైద్య రంగాల్లో..

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన యంగ్ ఇండియా స్కూళ్ల కేటాయింపులో ఇప్పటివరకు జిల్లాకు చోటు దక్కలేదు. దీనిపై ఈ ఏడాదైనా సానుకూల నిర్ణయం తీసుకోవాలని జిల్లా వాసులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లాకు మంజూరైన నవోదయ పనులు ఈ ఏడాది ప్రారంభమయ్యే అవకాశముంది. అయితే సమస్యల వలయంలో చిక్కుకున్న ఇంజనీరింగ్ కాలేజీ (కొత్తగూడెం)పై ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈ కాలేజీని యూనివర్సిటీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసేందుకు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. వైద్య రంగంలో ఈ ఏడాది 50 పడకల సామర్థ్యం గల ట్రామాకేర్ సెంటర్ కొత్తగూడెంలో అందుబాటులోకి వచ్చే ఆస్కారం ఉంది. ఇల్లెందు, అశ్వారావుపేట, బూర్గంపాడులో 100 పడకల ఆస్పత్రులకు భవన నిర్మాణ పనులు మొదలయ్యే అవకాశముంది. ఇక భద్రాచలం ఆస్పత్రిలో ఈ ఏడాదైనా సిబ్బంది కొరతను తీర్చడంతో పాటు ఆధునిక ఎక్విప్‌మెంట్‌ను అందుబాటులోకి తేవాలని ఏజెన్సీ వాసులు కోరుతున్నారు.

పర్యాటకానికి అడుగులు..

రాష్ట్ర ప్రభుత్వం ఎకో టూరిజానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఉన్న ప్రకృతి సంపదను గరిష్ట స్థాయిలో ఉపయోగించుకోవాల్సిన అవసరముంది. ఇప్పటికే భద్రాచలం, పర్ణశాల, కిన్నెరసాని, కొత్తగూడెం, చండ్రుగొండ (కనకగిరి గుట్టలు), ఇల్లెందు (పూబెల్లి), బూర్గంపాడు(మోతెగడ్డ)లో అభివృద్ధి పనుల కోసం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ ప్రాంతాల్లో ఎకో టూరిజం దిశగా మరిన్ని అడుగులు ఈ ఏడాది పడతాయని జిల్లా వాసులు ఆశిస్తున్నారు.

పవర్ ప్లాంట్ వస్తే..

పాల్వంచలోని కేటీపీఎస్ థర్మల్ పవర్ ప్లాంట్‌లో 400 ఎకరాల స్థలం కొత్తగా అందుబాటులోకి రాగా, ఇక్కడ థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. ఇక పాల్వంచలోనే ఎన్‌ఎండీసీ ఆధీనంలో నిరుపయోగంగా ఉన్న 400 ఎకరాల స్థలాన్ని ఎలా ఉపయోగంలోకి తేవాలనే అంశంపైనా చర్చ నడుస్తోంది. ఈ రెండింటి విషయంలో సానుకూల ఫలితం వస్తే పారిశ్రామికంగా జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. సింగరేణి ఆధ్వర్యంలో ఈ ఏడాది కచ్చితంగా రొంపేడు, వీకే ఓసీ గనులు ప్రారంభమయ్యే అవకాశముంది.

రవాణా మెరుగుపర్చాలని..

కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం అంశానికి గతేడాది అధిక ప్రాధాన్యత లభించింది. ఇదే జోరు కొనసాగితే టెక్నికల్ సర్వే, భూసేకరణ అంశాలు ఈ ఏడాది కొలిక్కి వచ్చే ఆస్కారం ఉంటుంది. అలాగే భద్రాచలం – మల్కన్‌గిరి, భద్రాచలంరోడ్ – కొవ్వూరు రైల్వేలైన్ల పనులు ప్రారంభించాలని జిల్లా వాసులు కోరుతున్నారు. దీంతో పాటు కొత్తగూడెం నుంచి షిర్డీ, తిరుపతికి కొత్త రైళ్లు నడిపించాలని, రద్దయిన రైళ్లను పునరుద్ధరించాలని అంటున్నారు. ఆర్టీసీ పరంగా జిల్లాలో ఉన్న నాలుగు డిపోలకు కొత్త బస్సులు కేటాయించాలని కోరుతున్నారు. ఇల్లెందు శాటిలైట్ డిపోలో ఫ్యూయల్ స్టేషన్ అందుబాటులోకి తేవడంతో పాటు పూర్తి స్థాయి డిపోగా అప్‌గ్రేడ్ చేయాలనే డిమాండ్ వినిపిస్తోంది.



ఇల్లెందు లేక్ వ్యూ పార్కులో నూతన సంవత్సర వేడుకలకు హాజరైన స్థానికులు

నయా జోష్ !



2024 సంవత్సరానికి వీడ్కోలు, 2025కు స్వాగతం పలుకుతూ జిల్లాలో మంగళవారం అర్ధరాత్రి నుంచి నిర్వహించిన వేడుకలు అంబరాన్నంటాయి. గ్రామం, పట్టణం తేడా లేకుండా అన్ని వర్గాల వారు కేకులు కట్ చేస్తూ, యువత రోడ్లపై కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మహిళలు, యువతులు ఇళ్ల ముందు అందమైన రంగవల్లులు తీర్చిదిద్దారు. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు తదితర పట్టణాల్లో స్వీట్ షాపులు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ఇక వైన్స్, బార్ల వద్ద మందుబాబులు సందడి చేశారు. జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

9లో

ఎంసీహెచ్‌లో మొక్కలు నాటాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్

సింగరేణి(కొత్తగూడెం): రామవరంలోని మాతా శిశు ఆస్పత్రిలో భారీగా మొక్కలు నాటాలని, ఆస్పత్రి ఆవరణను సుందరంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఎంసీహెచ్ ఆవరణలో ఖాళీగా ఉన్న 1.5ఎకరాల స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఆ స్థలంలో ఔషధ, సుందరీకరణ మొక్కలు నాటాలని సూచించారు. మాతా శిశు కేంద్రానికి వచ్చే వారికి నీడనిచ్చేలా చూడాలని, ఆవరణలో వర్షపు నీరు నిల్వకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ శేషాంజన్ స్వామి, డీఈ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎంసీహెచ్ ఆవరణను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్ తదితరులు

ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా ప్రజలకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో అభివృద్ధి పథంలో పయనించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందేలా కృషి చేస్తామని, జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కూడా మరో ప్రకటనలో అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులను పరీక్షలకు సన్నద్ధం చేయాలి

ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి



విద్యార్థులతో కలిసి విజయచిహ్నం చూపిస్తున్న యాదగిరి

టేకులపల్లి : త్వరలో జరగబోయే ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయాలని ఇంటర్ బోర్డ్ డిప్యూటీ సెక్రటరీ సీహెచ్.యాదగిరి అధ్యాపకులకు సూచించారు. మంగళవారం ఆయన టేకులపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అధ్యాపకులు పాఠాలు బోధించడమే కాకుండా విద్యార్థుల జీవితాల్లో మార్పు తేవాలని, నైపుణ్యాలు, నైతిక విలువలు పెంచాలని అన్నారు. కార్యక్రమంలో డీఐఈఓ హెచ్. వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ బి.సులోచనారాణి, అధ్యాపకులు బసవమ్మ, సత్యవతి, ముంతాజ్ అలీ, శంకర్‌రావు, వేణుగోపాల్, శ్రీనివాసరావు, యాకూబ్, వరలక్ష్మి, ప్రమోద్‌కుమార్, నాగేశ్వరరావు, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

అందరికీ మంచి జరగాలి

జిల్లా జడ్జి పాటిల్ వసంత్



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: నూతన సంవత్సరంలో అందరికీ మంచి జరగాలని జిల్లా జడ్జి పాటిల్ వసంత్ ఆకాంక్షించారు. ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలూ) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్లను కొత్తగూడెం కోర్టులో మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. న్యాయవాదుల పని ప్రణాళికల రూపకల్పనకు ఈ క్యాలెండర్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో ఐలూ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లి సత్యనారాయణ, న్యాయమూర్తులు బి.రామారావు, ఎ.సుచరిత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఐలూ జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ మక్కడ్, జె.వి.శివరాం ప్రసాద్, పి.కిషన్‌రావు, రావిలాల రామారావు, జీకే అన్నపూర్ణ, జి.సునంద, అరికల రవికుమార్, తోట మల్లేశ్వరరావు, నల్లమల్ల ప్రతిభ, పీపీ పి.వి.డి.లక్ష్మి, లావణ్య పాల్గొన్నారు.

పెద్దమ్మగుడిలో దుకాణాలకు 3న వేలం

పాల్వంచరూరల్ : మండల పరిధిలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయానికి చెందిన రెండు ఏసీ ఫంక్షన్‌హాళ్లు, కొత్త కాంప్లెక్స్‌లోని 4వ నంబర్ షాప్ నిర్వహణకు మూడేళ్ల పాటు లీజు, లైసెన్స్ హక్కులు పొందేందుకు ఈనెల 3న వేలం నిర్వహిస్తున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇంకా పోగుచేసిన చీరల అమ్మకం, పాత కాంప్లెక్స్‌లోని ఒకటో నంబర్ షాపులో బొమ్మలు, బల్లలు, ఇతర వస్తువుల అమ్మకానికి కూడా వేలం ఉంటుందని వెల్లడించారు. శుక్రవారం మధ్యాహ్నం 1.30 గంటల వరకు తగిన రుసుము చెల్లించి దేవస్థానం కార్యాలయంలో షెడ్యూల్ పొందాలని, నగదు లేదా డీడీ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

మత్స్యావతారంలో సమ్మోహనపర్చి..



బేడా మండపంలో స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు, వేదపండితులు



ఇన్‌చార్జ్ ప్రధానార్చకుడు రామస్వరూప్‌కు దీక్షావస్త్రాలు అందజేస్తున్న ఈఓ

- ఘనంగా ప్రారంభమైన వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాలు
- నేడు కూర్మావతారంలో రామయ్య దర్శనం

భద్రాచలం : భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దివ్యక్షేత్రంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు మంగళవారం వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. స్వామివారు తొలి రోజు మత్స్యావతారంలో దర్శనమివ్వగా తిలకించిన భక్తులు పులకించారు. స్వామివారి అవతారాన్ని చూసి సమ్మోహనాభరితులయ్యారు. మొదట ఉత్సవాల నిర్వహణకు గర్భగుడిలో మూలమూర్తుల వద్ద అర్చకులు అనుజ్ఞ తీసుకున్నారు. ఆ తర్వాత ఉత్సవమూర్తులను, ఆళ్వార్లను మేళతాళాల నడుమ బేడా మండపంలో కొలువుదీర్చి పూజలు నిర్వహించారు. సేవాకాలం, ప్రబంధాలు పఠించారు. వైదిక సిబ్బందికి ఆలయ ఈఓ ఎల్.రమాదేవి దీక్షా వస్త్రాలు అందజేశారు.

మిథిలా వేదికపై..

బేడా మండపంలో పూజల అనంతరం స్వామివారిని మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, వేదపండితుల మంత్రోచ్ఛరణలు, భక్తుల కోలాటాల నడుమ ఊరేగింపుగా తీసుకెళ్లి మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై కొలువుదీర్చారు. భక్తుల దర్శనానంతరం తాతగుడి సెంటర్ వరకు తిరువీధి సేవ నిర్వహించి తిరిగి ఆలయంలో వేంచేయింపజేశారు. ఉత్సవాల సందర్భంగా ధ్వజస్తంభం వద్ద, ఉపాలయాలను పూలతో అందంగా తీర్చిదిద్దారు. పూలతోనే 'జై శ్రీరామ్', 'శ్రీ రామాయనమః' అని అలంకరించగా భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు విజయరాఘవన్, స్థానాచార్యులు స్థలశాయి, ఇన్‌చార్జ్ ప్రధానార్చకులు కోటి రామస్వరూప్, వేదపండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. మిథిలా స్టేడియం వేదిక వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

నేడు కూర్మావతారం..

అధ్యయనోత్సవాల్లో భాగంగా శ్రీ ఆది మహావిష్ణువు స్వరూపమైన సీతారామచంద్ర స్వామి వారు బుధవారం కూర్మావతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవతలు, రాక్షసులు మంధర పర్వతాన్ని కవ్వంగా, వాసుకి అనే పామును తాడుగా చేసుకుని అమృతం కోసం క్షీరసాగరాన్ని చిలుకుతున్న సమయంలో ఏ ఆధారం లేక మంధగిరి మునిగిపోయింది. దీంతో దేవతలు, రాక్షసుల ప్రార్థన మేరకు శ్రీహరి కూర్మావతారాన్ని ధరించి మునిగిపోయిన మంధర పర్వతాన్ని తన వీపుతో పైకెత్తి సహాయపడ్డాడు. ఈ అవతారాన్ని దర్శిస్తే శని గ్రహ సంబంధమైన దోషాలు తొలగుతాయని పండితులు చెబుతున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలపై 3న అవగాహన సదస్సు

కొత్తగూడెంఅర్బన్ : ఈనెల 7 నుంచి 9 వరకు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో జరిగే రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో ఈనెల 3న అవగాహన సదస్సు నిర్వహిస్తామని డీఈఓ ఎం.వెంకటేశ్వరాచారి, సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గత నవంబర్ 18 నుంచి 20వ తేదీ వరకు అన్నపురెడ్డిపల్లిలో జరిగిన జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్, ఇన్‌స్పైర్ పోటీల్లో ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థులు మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ మనాక్ పోటీలకు ఎంపికైన వారు పూర్తిస్థాయి ప్రాజెక్ట్ రిపోర్ట్ పెన్‌డ్రైవ్‌తో పాటు మూడు ఆబ్‌స్ట్రాక్ట్ కాపీలు, బోనఫైడ్ సర్టిఫికెట్, రెండు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారి వివరాలను హెచ్‌ఎంలు, ఎంఈఓల గ్రూప్‌ల్లో పోస్ట్ చేశామని తెలిపారు.

48 మంది పోలీసులకు సేవా పతకాలు

కొత్తగూడెంటౌన్: ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసుల సర్వీసును గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వారికి ఉత్తమ, మహోన్నత, కఠిన సేవా పతకాలను ప్రకటించింది. జిల్లాలో 48 మంది పోలీసులు ఈ పతకాలకు ఎంపికయ్యారు. మహోన్నత సేవా పతకాలు సాధించిన వారిలో ఆరో బెటాలియన్ కమాండెంట్ డి.శివప్రసాద్‌రెడ్డితో పాటు మరో నలుగురు ఉన్నారు. ఆర్‌ఎస్సైలు కె. జగన్మోహనాచారి, షేక్ హుస్సేన్, సీహెచ్.హరీష్, ఎ.ఏకాంబరం, వి, రామారావు, బి.కిశోర్‌రెడ్డి, బి. హనుమంతరావు, కానిస్టేబుళ్లు జి.భరత్‌కుమార్(దుమ్ముగూడెం), బి.మహేష్‌కుమార్(గుండాల), ఎన్.నరేష్(టేకులపల్లి), బి.మోహన్(మణుగూరు), ఏఆర్ కానిస్టేబుల్ బి.దేవేంద్ర కఠిన సేవా పతకాలు సాధించారు. ఇక ఎస్సై జి.శ్రీనివాసులు, బోడు ఏఎస్సై ఎస్‌కే మహ్మద్‌కు సేవా పతకాలు దక్కాయి.



సీఎం కప్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు ప్రారంభం

బాణం గురితప్పకుండా..


పోటీలో బాణం గురి పెట్టిన క్రీడాకారులు


పాయింట్లను పరిశీలిస్తున్న డీవైఎస్‌ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో భాగంగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఆర్చరీ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. ఈ పోటీలకు రాష్ట్ర నలుమూలల నుంచి 100 మంది క్రీడాకారులు హాజరయ్యారు. పోటీలను ఖమ్మం డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్‌రెడ్డి, ఆర్చరీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పుట్టా శంకరయ్య, శాట్స్ కోచ్ రవిశంకర్ ప్రారంభించారు. రికర్స్, కాంపౌండ్ విభాగాల్లో బాలబాలికలు పోటీ పడగా తొలిరోజు ఎలిమినేషన్ రౌండ్ పూర్తయింది. ఇక బుధవారం పోటీల అనంతరం ర్యాంకులు కేటాయిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు క్రిస్టోఫర్‌బాబు, ఎస్.ఏ.ఉప్పల్‌రెడ్డి, పి.రఘునందన్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు షెడ్ల తొలగింపు

చుంచుపల్లి: ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట అదనంగా వేసిన షెడ్లను అధికారులు మంగళవారం తొలగించారు. ఆర్టీసీ బస్టాండ్ చుట్టూ వివిధ షాపుల నిర్మాణం కోసం అద్దె ప్రాతిపదికన యజమానులకు కేటాయించింది. అయితే వీటి విషయంలో గత కొంత కాలంగా షాపు ముందు భాగంలో అదనంగా షెడ్లు వేయగా వాటిని ఆర్టీసీ అధికారులు తొలగిస్తున్నారు. అదనపు షెడ్లు వేయొద్దని అధికారులు హెచ్చరించారు. కార్యక్రమంలో డీఎం దేవేందర్‌గౌడ్, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులు ఇబ్బంది పడకుండా వసతులు

ఐటీడీఏ పీఓ రాహుల్


గోదావరి స్నానఘాట్ల వద్ద సూచనలు ఇస్తున్న పీఓ రాహుల్

భద్రాచలం: భద్రాచలంలో జరగనున్న తెప్పోత్సవం, ఉత్తర ద్వార దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. గోదావరి ఒడ్డుతో పాటు ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న ఏర్పాట్లను ఆయన మంగళవారం పరిశీలించి మాట్లాడారు. భక్తులు అధికంగా బస చేసే ప్రదేశాల్లో తాత్కాలిక టాయిలెట్ల నిర్మాణం చేపట్టాలని, స్నానాల గదులు ఎక్కువగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇక గోదావరి కరకట్టపై గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి వస్తువులు, ఆహార పదార్థాల స్టాళ్లు సిద్ధం చేయాలన్నారు. ఆ తర్వాత అనాథ శరణాలయాన్ని పరిశీలించి దాని ఎదురుగా ఖాళీ స్థలం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, వివిధ శాఖల ఉద్యోగులు హరీశ్, వెంకటేశ్వర్లు, రవీందర్‌రావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ యువతకు శిక్షణ

పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచేలా నిరుద్యోగ యువతీ, యువకులకు ఐటీడీఏ ద్వారా శిక్షణ ఇప్పించడానికి కృషి చేస్తానని పీఓ రాహుల్ తెలిపారు. భద్రాచలంలోని తాత గుడి సెంటర్‌లో ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించగా పోటీ పరీక్షలకు మరిన్ని పుస్తకాలు సమకూర్చాలని అభ్యర్థులు కోరారు. పీఓ స్పందిస్తూ ఖాళీ ప్రదేశంలో హాల్ నిర్మాణం, తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని డీఈ హరీశ్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, జాన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం లోడ్ల దిగుమతికి నిరాకరణ

పాల్వంచరూరల్: ధాన్యం నాణ్యత లేదనే నెపంతో యజమాని దింపుకోవడానికి నిరాకరించిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. హరిజనవాడలోని జీసీసీ కొనుగోలు కేంద్రం ద్వారా రైతుల నుంచి కొన్న 653 బస్తాలు (252 క్వింటాళ్లు) రెండు లారీల లోడు ధాన్యాన్ని గత డిసెంబర్ 27న పాల్వంచ శివారులోని రైస్‌మిల్లుకు పంపించారు. ధ్యాన్యంలో నాణ్యతా లోపం ఉందని యజమాని నిరాకరించాడు. రైతులు సీపీఐ జిల్లా నాయకుడు ముత్యాల విశ్వనాథంతో కలిసి మిల్లు యజమానితో మాట్లాడటంతో దిగుమతికి ఒప్పుకున్నాడు.

కలప పట్టివేత

దుమ్ముగూడెం: మండలంలోని మంగవాయిబాడువా శివారులో దాచి తరలించడానికి సిద్ధం చేసిన 8 టేకు దిమ్మలను అటవీశాఖ అధికారులు సోమవారం రాత్రి పట్టుకున్నారు. వాటి విలువ రూ.90వేలు ఉంటుందని దుమ్ముగూడెం రేంజ్ అధికారి కమల, డీఆర్వో శోభన్ నాయక్ వెల్లడించారు.

రైతాంగ ఉద్యమంపై దాడి హేయం

సింగరేణి(కొత్తగూడెం): శంభు సరిహద్దుల్లో భాష్పవాయుగోళాల ప్రయోగం సిగ్గుచేటని, మోదీ సర్కార్ చేసిన దాడిని ఖండించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐపీకేఎస్) రాష్ట్ర అధ్యక్షులు కెచ్చెర్ల రంగారెడ్డి అన్నారు. మంగళవారం కొత్తగూడెంలో ప్రదర్శన నిర్వహించగా ఆయన మాట్లాడారు. రైతులు శాంతియుతంగా చేస్తున్న పాదయాత్రపై శంభు సరిహద్దులో భాష్పవాయు గోళాలను ప్రయోగించిందని, ఢిల్లీ వైపు వెళ్లకుండా అడ్డుకోవడం హేయమైన చర్య అని మండిపడ్డారు. గుమ్మడి నర్సయ్య, ముద్దా భిక్షం, నాయిని రాజు, కె.కల్పన, ఈసం శంకర్, మాచర్ల సత్యం, బానోత్ ధర్మ, నూపా భాస్కర్, కల్లూరు కిశోర్, రాము, బుర్ర వెంకన్న పాల్గొన్నారు.

కలెక్టర్‌కు తపాలా సేవల బుక్‌లెట్ అందజేత


కలెక్టర్‌కు బుక్‌లెట్ అందజేస్తున్న పోస్టల్ అధికారులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మన తపాలా – మన సేవలు పోస్టల్ స్కీమ్‌కు సంబంధించిన బుక్‌లెట్ ను పోస్టల్ అధికారులు మంగళవారం కలెక్టర్ జితేశ్ వి పాటిల్‌కు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. తపాల సేవలకు సంబంధించిన సమగ్ర సమాచారంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్వంచ ఐపీఓ ఎం.వీరన్న, ఎస్‌పీఎం మాచర్ల రమేశ్, అలీం, సిద్ధు పాల్గొన్నారు.

ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

మార్క్‌ఫెడ్ డైరెక్టర్ శ్రీనివాసరావు

అశ్వాపురం: రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. అశ్వాపురం మండలం మిట్టగూడెంలో డీసీఎంఎస్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమ శాతాన్ని పరీక్షించాక రైతులతో మాట్లాడారు. సన్న ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాకు రూ.500 బోనస్ చెల్లిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాగా, నిర్వాహకులు సైతం కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడకుండా వసతులు కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరాలపై దాడి

దమ్మపేట: మండలంలోని వడ్లగూడెం, రామచంద్రాపురం శివార్లలో నిర్వహిస్తున్న రెండు వేర్వేరు కోడి పందేల స్థావరాలపై పోలీసులు మంగళవారం దాడి చేశారు. వడ్లగూడెం వద్ద నలుగురిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి మూడు బైకులు, రెండు కోడి పుంజులు, రూ.3,250 నగదు, రామచంద్రపురం శివారులో ఓ వ్యక్తి, రెండు బైకులు, రెండు పుంజులు, రూ.2,150 నగదును స్వాధీనం చేసుకుని, రెండు ఘటనలపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

గుట్టగూడెం శివారులో...

ములకలపల్లి: మండలంలోని గుట్టగూడెం శివారులో కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, 8 మందిని అరెస్ట్ చేశారు. రూ.3 వేల నగదు, 4 కోడి పుంజులు, 2 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

పేకాట స్థావరంపై..

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం చిలకలగండి ముత్యాలమ్మ ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై ఎస్‌ఐ యయాతిరాజు ఆధ్వర్యంలో మంగళవారం దాడి చేశారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి రూ.20 వేల నగదు, రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. మరో ఆరుగురు పారిపోగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ఇసుక నిల్వలు సీజ్

బూర్గంపాడు: మండలంలోని ఉప్పుసాక గ్రామంలో ఇసుక నిల్వలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. కిన్నెరసాని నుంచి 20 లారీల ఇసుకను అక్రమంగా రాత్రి వేళ తీసుకొచ్చి ఉప్పుసాకలో నిల్వచేయగా... మంగళవారం సమాచారం అందుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ముత్తయ్య, నర్సింహారావు గుర్తించి సీజ్ చేశారు.

నీటి తొట్టిలో పడి బాలుడి మృతి


బాలుడి మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

జూలూరుపాడు: ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన మండలంలోని మాచినేనిపేటతండా జీపీ చిన్నతండాలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం .. తండాకు చెందిన లకావత్ అశోక్, శివానీ దంపతులకు రెండున్నరేళ్ల కుమారుడు శ్రీమంజునాథ్, కుమార్తె జస్మిక ఉన్నారు. అశోక్, అతడి తండ్రి శ్రీను సుజాతనగర్ పత్తి యార్డులో పనికి వెళ్లారు. అశోక్ తల్లి కూలి పనులకు వెళ్లింది. ఇంట్లోకి కోతులు రావడంతో వాటిని కొట్టేందుకు శివానీ వెళ్లగా శ్రీమంజునాథ్ ఆడుకుంటూ వెళ్లి నీటి తొట్టిలో పడి మృతిచెందాడు. ఆమె వచ్చి చూసేసరికి తొట్టిలో విగతజీవిగా కనిపంచగా కేకలు వేసింది. చుట్టుపక్కలవారు వచ్చి బాలుడి మృతదేహాన్ని వెలికితీయగా.. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

నీటి గుంతలో పడి వ్యక్తి...

బూర్గంపాడు: నీటి గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలోని సంజీవరెడ్డిపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. బూర్గంపాడులోని గౌతమిపురం గ్రామానికి చెందిన తోకల సతీశ్ (36) మంగళవారం సంజీవరెడ్డి పాలెం గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో పనికి వెళ్లాడు. బాగా నీరసించి బురదనీటి గుంతలో పడి.. ఊపిరాడక మృతి చెందాడు. ఇటీవల అనారోగ్యానికి గురైన సతీశ్.. కళ్లు తిరిగి బురదనీటిలో పడిపోయి మృతి చెంది ఉంటాడని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మృతుడి భార్య గంగ ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రాజేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.